ఆంధ్రప్రదేశ్ తెలుగు దినపత్రిక

# నిజం చెపుతాం

సంచిక : 01 సంపుటి : 48 ఎడిటర్ : క్రాంతి కుమార్ 25 - 02 - 2024 ఆదివారం 4 పేజీలు వెల : 2/-

## వచ్చే నెల నుంచి రేషన్ షాపుల్లో కిలో రాగిపిండి

**అమరావతి ( నిజం చెపుతాం ) :** రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు ఏపీ పౌరసరఫరాల శాఖ శుభవార్త అందించింది. వచ్చే నెల 1వ తేదీ నుంచి రేషన్ బియ్యంతో పాటు కిలో రాగి పిండిని కూడా సబ్సిడీ ధరపై అందజేయనున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం మార్కెట్ లో రాగి పిండి రూ.40 వరకు ఉండగా, రేషన్ దుకాణాల్లో రూ.11కే ఇస్తామని తెలిపారు. పౌరులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ముందుగా ఉత్తరాంధ్ర, రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో రాగి పిండిని సరఫరా చేసేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతామరాజు, అనకాపల్లి, పరతీపురం మన్యం.., రాయలసీమలో అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, వైఎస్ఆర్, అనంతపురం జిల్లాల్లోని రేషన్ దుకాణాలకు రాగి పిండి సరఫరా కానుంది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని రేషన్ షాపుల్లో అందుబాటులోకి తేవడానికి భావిస్తున్నారు. అయితే, రేషన్ షాపుల్లో ఒక రేషన్ కార్డు బియ్యం కోటాలో ఒక కేజీ బియ్యానికి బదులు ఈ కేజీ రాగి పిండిని తీసుకోవాల్సి ఉంటుంది. రాగులు, గోధుమలను స్థానిక రైతుల నుంచి సబ్సిడీ ధరలకు కొనుగోలు చేసి రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇది పూర్తయితే రైతులకు గిట్టుబాటు ధర లభించడంతోపాటు రేషన్ కార్డులున్న పేదలకు పౌష్టికాహారం అందుతుందని భావిస్తున్నారు.

# 99 మందితో టీడీపీ - జనసేన తొలి జాబితా

- విడుదల చేసిన చంద్రబాబు-పవన్ కల్యాణ్
- జనసేనకు 24 అసెంబ్లీ -3 ఎంపి స్థానాలు
- ఓటు బదిలీ జరగాలన్న ఇరు పార్టీల అధినేతలు



**అమరావతి ( నిజం న్యూస్ ) :** తెలుగుదేశాంజనసేన పార్టీల శాసనసభ అభ్యర్థుల తొలిజాబితా విడుదలైంది. టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఉమ్మడిగా శనివారం ఉదయం ఈ జాబితాను విడుదల చేశారు. చంద్రబాబునాయుడి నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్రంలోని 175 శాసనసభ స్థానాల్లో జనసేన 24 స్థానాల్లో పోటీ చేస్తుందని, 25 లోక్‌సభ స్థానాల్లో 3 స్థానాల్లో బరిలోకి దిగుతుందని ఈ సందర్భంగా ఇరుపార్టీల నేతలు ప్రకటించారు. మిగిలిన స్థానాల్లో టిడిపి పోటీ చేస్తుందని తెలిపారు. 'బిజెపి కూడా కలిసివస్తే ఆ పార్టీకి కేటాయించే సీట్లపై తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటాం' అని చంద్రబాబు చెప్పారు. తమ పొత్తును ఆశీర్వదించి అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు. ఓటు బదిలీ జరిగేలా ఇరు పార్టీల కార్యకర్తలు తప్పనిసరిగా చూడాలని కోరారు.

### రాష్ట్ర భవిష్యత్తు కోసమే : చంద్రబాబు నాయుడు

రాష్ట్ర భవిష్యత్తు కోసమే టిడిపి -జనసేన కలిసి పోటీ చేస్తున్నాయని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. అధికారంలోకి రాగానే ప్రజావేదిక నుండి జగన్ విధ్వంసం మొదలుపెట్టారని అన్నారు. తమ పొత్తు ప్రకటించిన రోజే తాము గెలిచామని, అప్పటి నుంచి వైసిపి కాడిపడేసిందని తెలిపారు. రౌడీయిజం, దొంగ ఓట్లు చేర్చి గెలవాలని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చూస్తున్నారని అన్నారు. అవినీతి డబ్బులతో ఓట్లు కొనే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందన్నారు. ఐదు కోట్ల మంది ప్రజలు ఒక పక్క, రౌడీయిజం, అక్రమ సొమ్ము, ధనబలం, పెత్తందారులు ఉన్న వైసిపి మరోపక్క ఉందని చెప్పారు. ప్రజలే ముందుకు వచ్చి తమ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. అభ్యర్థుల ఎంపికలో ఎప్పుడూ చేయని కసరత్తు చేశానని చెప్పారు. ప్రకటించిన 99 స్థానాల్లో 23 మందికి కొత్తగా అవకాశం కల్పించామని తెలిపారు.

### ప్రయోగం చేయలేను : పవన్ కళ్యాణ్

తమ పార్టీ నుంచి ఎక్కువ స్థానాలు తీసుకుని ప్రయోగం చేయడం కంటే తక్కువ స్థానాలు తీసుకుని రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడేలా ముందుకెళ్తున్నామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. కొంతమంది 45 కావాలి, 75 కావాలి అంటున్నారని చెప్పారు. 2019లో 10 స్థానాలు తమ పార్టీ గెలిచి ఉంటే ఎక్కువ స్థానాలు అడగడానికి అవకాశం ఉండేదని వారితో చెప్పానని తెలిపారు. అందుకే తక్కువ స్థానాల్లో గట్టి పోటీ ఇవ్వాలని, 24 స్థానాల్లో పోటీ చేస్తున్నామని తెలిపారు. మూడు లోక్‌సభ స్థానాల్లో పోటీ చేస్తే 21 అసెంబ్లీ స్థానాలు వాటిలో భాగమవుతాయని, వీటిని కూడా కలుపుకుంటే 40 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లే లెక్క అని చెప్పారు. టిడిపి-జనసేన పొత్తు బలంగా ఉండాలని అన్నారు. తమ పార్టీ కార్యకర్తలు టిడిపికి ఓటు వేయడం ఎంత ముఖ్యమో, టిడిపి ఓటు జనసేనకు వేయడం అంతే ముఖ్యమని చెప్పారు. వైసిపి పన్నాగాలు సృష్టిస్తే కలిసికట్టుగా ఎదుర్కొంటామన్నారు. వైసిపి విముక్త రాష్ట్రమే ప్రథమ అజెండా అని అన్నారు. వైఎస్ జగన్ సిద్ధమంటే తాము యుద్ధం చేస్తామని వ్యాఖ్యానించారు. సీట్ల సర్దుబాటులో బిజెపిని కూడా దృష్టిలో పెట్టుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు కె అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, కె నాగబాబు పాల్గన్నారు.

## ఆప్, కాంగ్రెస్‌ల మధ్య కుదిరిన పొత్తు..నేడు అధికారిక ప్రకటన




**న్యూఢిల్లీ ( నిజం న్యూస్ ) :** రానున్న లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు విషయంలో ఆప్, కాంగ్రెస్‌ల మధ్య పొత్తు కుదిరింది. రెండు పార్టీల మధ్య పొత్తుపై నేడు అధికారిక ప్రకటన వెలువడనుందని కాంగ్రెస్ ఎంపి జైరాం రమేశ్ ధృవీకరించారు. శనివారం ఇరు పార్టీలకు చెందిన నేతలు సంయుక్త మీడియా సమావేశంలో ఐదు రాష్ట్రాల పొత్తును ప్రకటించనున్నారని జైరాం రమేష్ తెలిపారు. కాగా, ఢిల్లీ, హర్యానా, చండీగఢ్, గోవా, గుజరాత్ ఐదు రాష్ట్రాల్లో కాంగ్రెస్, ఆప్ కలిసి పోటీ చేసేందుకు సిద్ధమయ్యాయి. ఢిల్లీలో నాలుగు స్థానాల్లో, కాంగ్రెస్ మూడు స్థానాల్లో పోటీ చేసేందుకు ఇరు పార్టీల మధ్య అంగీకారం కుదిరింది. గుజరాత్‌లో రెండు లోక్‌సభ స్థానాల్లో, హర్యానాలో ఒక స్థానంలో ఆప్ పోటీ చేయనుంది. పంజాబ్‌లో కాంగ్రెస్‌తో ఎటువంటి పొత్తు ఉండదని ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ఇప్పటికే స్పష్టం చేశారు. పంజాబ్‌లో మొత్తం 13 స్థానాల్లో ఆప్ బరిలో దిగుతుందని ఆయన వెల్లడించారు. ఇక మిగిలిన రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటుపై నేడు అధికారక ప్రకటన వెలువడనుంది.

## పవన్ ను ముంచేసిన చంద్రబాబు : సజ్జల



**తాడేపల్లి ( నిజం న్యూస్ ) :** జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను చూస్తే జాలేస్తోందన్నారు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి. జనసేన అభ్యర్థులను కూడా చంద్రబాబు డిసైడ్ చేస్తారా?. అలాగే, ఎన్నికల్లో చంద్రబాబు పడేసే సీట్లు తీసుకునే స్థితికి పవన్ దిగజారిపోయారని సజ్జల కామెంట్స్ చేశారు. నేడు విడుదలైన టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థుల తొలి జాబితాపై సజ్జల స్పందించారు. తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, పొలిటికల్ పార్టీ నడిపే లక్షణాలు పవన్‌కు లేవని. అత్యంత దయనీయ స్థితిలో ఆయన ఉన్నారన్నారు. ఎన్నో ప్రగల్భాలు పలికిన పవన్ ఇప్పుడు ఎందుకు దిగజారిపోయారన్నారు. జనసేనను మింగేసి ప్రయోజనం పొందాలని చంద్రబాబు చూస్తున్నారని ఆరోపించారు సజ్జల. టీడీపీ, జనసేనవి దింపుడు కళ్లెం ఆశలని. ఆశించిన సీట్లు రావనే చంద్రబాబు డ్రామాలాడుతున్నారన్నారు. జనసేన మిగిలిన స్థానాల్లోనూ చంద్రబాబు తన అభ్యర్థులను పంపుతారని జోస్యం చెప్పారు.. ఎవరు ఎన్ని సీట్లలో పోటీ చేసినా తమకు ఇబ్బంది లేదని. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీదే ఘన విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఇకనైనా పవన్‌ను అభిమానించే వారంతా ఒక్కసారి ఆలోచించుకోవాలన్నారు సజ్జల.

## రఘురామ కృష్ణంరాజు రాజీనామా

### సిఎం జగన్‌కు లేఖ



**భీమవరం ( నిజం న్యూస్ ) :** నరసాపురం ఎంపి కనుమూరి రఘురామ కృష్ణంరాజు వైసిపికి శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌కు లేఖ రాశారు. లేఖలో ముఖ్యమంత్రిపై ఘాటు విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి జగన్ తన పట్ల గజినీలా వ్యవహరించారని, అనర్హత వేటు వేయాలని ఎంతో ప్రయత్నం చేశారని, ఏమీ ఫలించలేదని పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో మనమిద్దరం తేల్చుకునే సమయం ఆసన్నమైందంటూ ఘాటుగా విమర్శించారు. గత ఎన్నికల్లో నరసాపురం పార్లమెంట్ స్థానం నుంచి వైసిపి తరపున రఘు రామకృష్ణంరాజు పోటీ చేసి గెలుపొందారు. కొన్నాళ్ల తర్వాత వైసిపి నుంచి విభేదానికి గురైన ఆయన రెబల్ ఎంపిగా మారి ప్రభుత్వ విధానాలు, ముఖ్యమంత్రి జగన్‌పై ఘాటైన విమర్శలు చేస్తూ వచ్చారు. దీంతో రఘురామను సొంత గడ్డపై అడుగుపెట్టనీయకుండా సామ, దాన దండోపాయాలను వైసిపి ప్రయోగించింది. ఈ నేపథ్యంలో నాలుగేళ్ల పాటు ఆయన ఢిల్లీకే పరిమితమయ్యారు. ఈ ఏడాది జనవరిలో సంక్రాంతికి వచ్చారు. దీనిలో భాగంగా తాను వైసిపికి ఫిబ్రవరిలో రాజీనామా చేస్తానని అప్పట్లో ప్రకటించారు. ఈ నేపథ్యంలో వైసిపికి రాజీనామా చేస్తూ ముఖ్యమంత్రి జగన్‌కు లేఖ రాశారు.

# శ్రీకాకుళం జిల్లాలో బిసీ సంక్షేమ శాఖ వసతి గృహాలు పనితీరు సూపర్

## హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ల అంకిత భావం..విద్యార్థులకు వరం

**శ్రీకాకుళం ( నిజం న్యూస్ ) :** శ్రీకాకుళం జిల్లా లో బి.సీ సంక్షేమ శాఖ వసతి గృహాల పనితీరు అద్భుతం. వసతి గృహాల సంక్షేమ అధికారుల అంకితభావం విద్యార్థులకు వరంగా మారింది. విద్యార్థులను కన్న బిడ్డలలా చూసుకుంటున్నారు ఆయా వసతి గృహాల హెచ్.డబ్ల్యు.ఓలు. బిల్లులు సకాలంలో మంజూరు కాకపోయినా విద్యార్థులకు ఎలాంటి లోటూ రాకుండా చూసుకుంటున్నారు. హెచ్.డబ్ల్యు.ఓ.లు. నిరంతరం ప్రతీ విద్యార్థి పై ప్రత్యేక దృష్టి సారించి క్రమశిక్షణ తో మెలిగేలా చూస్తూ, భోజన, వసతి విషయాల్లో ఎలాంటి రాజీ పడకుండా 24 గంటలూ దగ్గరుండి చూసుకుంటున్నారు వసతి గృహ సంక్షేమ అధికారులు. విద్యార్థులకు ఏ కష్టం వచ్చినా వెంటనే మేమున్నానంటూ ముందుకెళ్లి ఆదుకుం టున్నారు. హెచ్.డబ్ల్యు.ఓ.లు. అందుకే వారిని విధ్యార్దులు దైవంగా భావిస్తున్నారు. హెచ్.డబ్ల్యు.ఓ.లు చూపిస్తున్న ఆదారాభిమానాలతో విద్యార్థులు తమతమ ఇళ్లకు సైతం వెళ్ళడానికి ఇష్టపడపడం లేదంటే ఎంత చక్కగా విద్యార్థులను చూసుకుంటున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం నిర్ణయించిన





మెనూ కంటే మెరుగైన భోజనం విధ్యార్దులకు అందుతుండడం విశేషం. వసతి గృహాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటూ అహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నారు హెచ్.డబ్ల్యు.ఓ.లు. విద్యార్థులకు ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే తమ సొంత ఖర్చులతో ఆసుపత్రికి తరలించి దగ్గరుండి వైద్యం చేయిస్తున్నారు హెచ్.డబ్ల్యు.ఓ.లు. అందుకే శ్రీకాకుళం జిల్లాలోని బి. సీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎంతో ఆరోగ్యంగా ఉంటారు. ఇదంతా హెచ్. డబ్ల్యు. ల. కృషి ఫలితమే అని చెప్పాలి. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న 81 బీసీ సంక్షేమ వసతి గృహాలు కూడా ఒకే రీతిలో ఎంతో చక్కగా నడుస్తున్నాయంటే అదంతా ఆయా వసతి గృహాల సంక్షేమ అధికారుల అంకితభావమేనని చెప్పాలి. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాదిస్తున్నారంటే హెచ్.డబ్ల్యు.ఓ.ల కృషి ఎంతగానో ఉంది. ఇంతటి అంకితభావం తో విధులు నిర్వహిస్తూ.. విద్యార్థులకను కన్న బిడ్డల్లా చూసుకుంటూ విద్యార్థులకు మంచి భవిష్యత్తునందిస్తున్న శ్రీకాకుళం జిల్లా బిసి సంక్షేమ వసతి గృహాల సంక్షేమ అధికారులను పలువురు అభినందిస్తున్నారు.

TELTEL/2022/83478 www.epaper.nijamnews.in
నిజం
తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ తెలుగు దినపత్రిక చెప్తుతాం

# సంపాదకీయం

## రాహుకాలాన్ని రాహుల్ గెలుస్తారా ?

కథఅడ్డం తిరిగిందనలేము కానీ, నల్లేరు మీద నడకలా నరేంద్రమోదీ నడిపిస్తున్న జాతీయ రాజకీయం మలుపు తిరిగింది. ఈ పరిణామం అధికార బిజెపి ఉద్దేశించిందా, లేక అనూహ్యంగానో తొందరపాటుతోనో సంభవించి తాను కూడా దిగ్భ్రాంతి చెందిందా, పర్యవసానాలకు ఏ పక్షం ఎంత మేరకు సిద్ధంగా ఉన్నది వంటి ప్రశ్నల మీద దేశమంతా చర్చ జరుగుతున్నది. ఈ మాత్రం వేడి ఈ మధ్యకాలంలో చూడలేదు. అధికార ప్రతిపక్షాలు ఇంతగా ముఖాముఖీ తలపడిన సన్నివేశం తొమ్మిదేళ్లలో ఎప్పుడు మాత్రం ఎదురయింది? ఇదంతా రాహుల్ గాంధీ వన్ మ్యాన్ షో తప్ప ఇందులో సంఘటిత ప్రతిఘటన ఎక్కడుంది అని అడిగేవాళ్లున్నారు. రాహుల్ వ్యక్తిత్వంలో, వ్యవహార సరళిలో ఇప్పుడు ఎంతో పరిపక్వతను చూడగలుగుతున్నాము. కానీ, అతడు ఒక కీలక, చారిత్రక సంక్షోభ సందర్భంలో సమర్థ నాయకుడిగా ప్రతిపక్షాన్ని నడిపించగలుగుతాడా అన్న సందేహానికి మాత్రం సంతృప్తికరమైన సమాధానం కార్యక్షేత్రంలో ఇంకా లభించవలసే ఉన్నది. కాకపోతే, ప్రస్తుత సందర్భం, అతని గురించిన సానుకూల వాగ్దానాన్ని అందిస్తున్నది. ఇతర పక్షాలన్నిటిని రాజకీయంగా బలహీనపరచి, దర్యాప్తు సంస్థల ద్వారా బాధించి, ఆ పైన చట్టసభలలో సైతం హేళన చేసి కేంద్రంలోని అధికారపార్టీ ఏకస్వామ్యపాలన నడిపిస్తున్నదన్న విమర్శలు తెలిసినవే. ప్రతిపక్షాలకు ఉనికి మిగలలేదు, వారి మాటలు జనం దగ్గరకు వెళ్లే అవకాశాలు కూడా లేవు. తొమ్మిదేళ్ల కాలంలో హిందీ ఇంగ్లీషు భాషల మీడియా అత్యధికం ఏకపక్షంగానే వ్యవహరిస్తున్నాయి. రాహుల్ గాంధీ ఐదు నెలల పాటు సాగించిన భారత్ జోడోయాత్రకు కూడా మీడియా నుంచి లభించిన స్పందన అతి స్వల్పం. ఎంతగా అప్రధానం చేసినప్పటికీ, రాహుల్ యాత్రకు ప్రజాదరణ అమితంగా లభించడం, సమాచార ప్రసార సాధనాల పాక్షికతకు ఉన్న పరిమితులను తెలియజేసింది. ప్రజలతో మెలగిన తరువాత, సమకూరిన ఆత్మవిశ్వాసంతో, లోకజ్ఞానంతో రాహుల్ గాంధీ కేంబ్రిడ్జి యూనివర్సిటీతో సహా బ్రిటన్‌లో అనేక చోట్ల సంభాషించారు. భారతదేశంలోని పరిస్థితుల గురించి తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఆయన విదేశాలలో భారతదేశాన్ని అప్రదిష్టపాలు చేశారని, జోక్యం చేసుకొమ్మని వారిని అడిగారని విమర్శలు వచ్చాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో రాహుల్ నుంచి అధికారపక్షం అందుకు క్షమాపణలు కోరింది. ఈ ఘట్టం రావడానికి ముందు అదానీ వివాదం వచ్చింది. అదానికి, ప్రధానికి ఉన్న సంబంధమేమిటని రాహుల్ లోక్‌సభలో అడిగారు. ఒకనాడు అర్భకుడిగా, మేదకుడిగా ముద్రపడిన ఈ నాయకుడు ఇప్పుడు భారత రాజ్యానికి సంబంధించిన ఒక కీలక ప్రశ్న సంధించాడు. తామే ప్రతిపక్షమన్నరీతిలో అధికారపక్షం ఆ ప్రశ్నను అణగార్చివేసింది. ఆ ప్రశ్న వేసినవాడిని సభనుంచి వెలివేయడం తరువాతి ఘట్టమైంది. రాహుల్ చెప్పినట్టు ఆ ఒక్కప్రశ్నే, అతనిని బహిష్కృతుడిని చేసిందా? అదే కనుక అయితే, మాయలఫకీరు ప్రాణం ఆ ప్రశ్నలోనే ఉన్నదేమో? మంగళవారం నాడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ రాజధానిలో పార్టీ కేంద్రకార్యాలయంలో సహచరులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఆసక్తికరమైన ఆరోపణలు చేశారు. అభివృద్ధి, దృఢమైన పరిపాలన ఎజెండాను రాజ్యాంగ సంస్థల పునాది మీద ముందుకు తీసుకపోతుండగా, దాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రాజ్యాంగ సంస్థలను అపఖ్యాతి పాలు చేస్తున్నారని, వాటిని కించపరుస్తున్నారని అన్నారు. రాజ్యాంగ సంస్థలంటే, ఆయన దృష్టిలో సిబిఐ, ఈడీ వంటివి కావు కదా అని అనుమానం కలిగింది. అవినీతిమీద, అవినీతిపరుల మీద విరుచుకుపడుతుంటే సహించలేని, దేశవిదేశీ శక్తులు కుట్రలకు పాల్పడుతున్నాయని ఆయన అన్నారు. సాంకేతికంగా ఈడీ సిబిఐ వంటివి రాజ్యాంగ సంస్థలు కావు. ప్రభుత్వ దర్యాప్తు ఏజెన్సీలు మాత్రమే. బహుశా, న్యాయవ్యవస్థను ఉద్దేశించి ఆయన ఆ మాట అని ఉంటారా? రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధించిన సూరత్ కోర్టు గురించి అనేక వ్యాఖ్యలు వినిపిస్తున్నందున అని ఉంటారా? మీడియాతో పాటు సోషల్ మీడియాను కూడా విశృంఖలంగా వినియోగించుకునే వ్యవస్థలు ఏర్పాటు చేసుకున్న జాతీయ అధికారపక్షం, అందుబాటులో ఉన్న సకల రంగాలను, వ్యవస్థలను తన అధికార స్థిరీకరణకు వినియోగించుకుంటూ వచ్చింది. కేవలం దర్యాప్తు సంస్థలను ప్రయోగించడమే కాకుండా, న్యాయవ్యవస్థను కూడా పరోక్షంగా అదుపు చేస్తూ వచ్చిందన్న విమర్శలు ఉన్నాయి. గత తొమ్మిదేండ్ల కాలంలో రకరకాల స్థాయిలలో న్యాయస్థానాలు దేశంలో నెలకొని ఉన్న ప్రాబల్య వాతావరణానికి ఒదిగి ఉండే ప్రయత్నమే ఎక్కువగా చేసినట్టు చూస్తాము. చట్టాలు, న్యాయపద్ధతుల మార్గంలోనే ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టడం ద్వారా అందుకు అభ్యంతరం చెప్పేవారికి నైతికత లేకుండా చేయవచ్చునన్నది అధికారపక్షం ఆలోచన. పరువునష్టం కేసులో రాహుల్ గాంధీకి శిక్ష, పార్లమెంటు సభ్యత్వానికి అనర్హత విషయంలో, చాలామంది అమాయకంగానూ, అతి తెలివిగానూ కూడా, అంతా చట్టప్రకారమే జరిగింది కదా అన్న వ్యాఖ్యలు చేస్తున్నారు. ఏదో ఎంపిక చేసిన సందర్భంలో కాక, చట్టం, న్యాయం అన్ని సందర్భాలలోనూ, అందరి విషయంలోనూ ఒకేవిధంగా వ్యవహరించాలి. అవమానపరిచే మాటలన్నందుకే ఒక నాయకుడికి రెండేళ్ల శిక్ష విధించే మాట అయితే, వారూ వీరూ అక్కరలేదు, సాక్షాత్తూ ఈ దేశ ప్రధానికే, అదే కారణానికి, అనేక శిక్షలు పడాలి. దేశం ఇప్పుడున్న స్థితి నుంచి బయటపడాలంటే, కేవలం ప్రతిపక్షాల ఐక్యత, పౌరసమాజం అప్రమత్తత మాత్రమే చాలవని, న్యాయవ్యవస్థ క్రియాశీలంగా మారడం కూడా ఆవశ్యకమని సూచనలు వస్తున్నాయి. రాహుల్ గాంధీకి ప్రజల నుంచి, ఇతర ప్రతిపక్షాల నుంచి ఇంతటి మద్దతు దొరకడాన్ని బిజెపి పెద్దలు ఎట్లా అర్థం చేసుకున్నారు? బిజెపి బాధితులందరూ ఒక గూటికి చేరడం తమకు రాజకీయంగా లాభం కలిగిస్తుందని అనుకుంటున్నారా? లేక, అనూహ్యమైన రీతిలో పరిణామాలు సాగడానికి అనవసరంగా తాము దోహదపడ్డామని పశ్చాత్తాపపడుతున్నారా? వారి అంతరంగాలేమిటో చెప్పలేము కానీ, నరేంద్రమోదీ మంగళవారం నాడు చేసిన ప్రసంగంలో ఒక చిన్న క్లూ ఉన్నది. అవినీతిపరులంతా కూడి తన మీద యుద్ధానికి వస్తున్నారని ఆయన పార్టీ శ్రేణులకు చెప్పుకున్నారు. "గట్టిగా పోరాడాలి" అని ఆయన పిలుపు కూడా ఇచ్చారు. ఈ గట్టి పోరు స్వరూప స్వభావాలెట్లా ఉంటాయో రాజకీయ రంగస్థలంలోనే చూడాలి.

## మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జాకీర్ హుస్సేన్ జయంతి



**మార్కాపురం, ఫిబ్రవరి 24 ( నిజం చెపుతాం ) :** మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ స్వతంత్ర సమర యోధుడు భారత మూడవ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ జాకీర్ హుస్సేన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు: ఈరోజు మార్కాపురం మైనారిటీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో భారతదేశ మూడవ రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్ గారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కమిటీ అధ్యక్షులు మొగల్ జాబీర్ హుస్సేన్ బేగ్ మాట్లాడుతూ డాక్టర్ జాకీర్ హుస్సేన్ గారు గాంధీ గారితో కలిసి స్వతంత్ర సంగ్రామంలో పాల్గొనడం జరిగిందనీ,భారతదేశ మూడవ రాష్ట్రపతిగా కూడా ఆయన సేవలను అందించడం జరిగినదనీ, డాక్టర్ జాకీర్ హుస్సేన్ తన సంపదనంతా కూడా దానధర్మాలు చేసిన గొప్ప దానకర్ణుడు, భారతదేశం నా ఇల్లు భారతీయులంతా నా కుటుంబం అని చెప్పిన గొప్ప దేశభక్తుడని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు షేక్ తాజ్ హుస్సేన్, లాడిలే కబీర్, సయ్యద్ షాదా, షేక్ మున్వర్, దూదేకుల మహమ్మద్ తదితరులు పాల్గొనడం జరిగినది.

## బిజెపిని బలోపేతం చేద్దాం



**కందుకూరు, ఫిబ్రవరి 24 ( నిజం చెపుతాం ) :** కందుకూరులోని భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన నియోజకవర్గ సమన్వయకర్తగా సీనియర్ నాయకులు ఘట్టమనేని హరి బాబు నియమించబడిన సందర్భంగా నియోజకవర్గంలోని మండల బాధ్యులు వివిధ మోర్చాల నాయకులు సీనియర్ నాయకులు భారతీయ జనతా పార్టీ అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగినది. ఈ సందర్భంగా హాజరైన బాధ్యులు నాయకులు హరిబాబు కి సంపూర్ణ సహకారాలు అందిస్తూ పార్టీ పురోగతికి తమ వంతు సహకారం అందిస్తామని, మీ పదవీకాలంలో పార్టీ పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షులు మన్నేపల్లి వరప్రసాదరావు ఓ కన్వీనర్ జొన్నాదుల సురేష్ రూరల్ మండల అధ్యక్షుడు చల్ల వెంకట్రాజ గుడ్లూరు మండల అధ్యక్షులు యండమూరి సుధాకర్ మలేటివారిపాలెం అధ్యక్షులు డేవిడ్ కరుణ జిల్లా ఎస్. టి. మోర్చా ఉపాధ్యక్షులు జగన్నాథ వైకుంఠం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి సుండి మురళీధర్ ఉపాధ్యక్షులు బొర్రా కోటేశ్వరరావు, మాల్యాద్రి నాయుడు కోశాధికారి చిన్ని పాండురంగయ్య సీనియర్ నాయకులు భూషయ్య జొన్నాదుల మోహన్రావు బెజవాడ వెంకయ్య సుబ్రహ్మణ్యం నాయకులు ఉన్నం భాస్కర్ రావు కార్యదర్శి బెల్లంపల్లి శ్రీధర్ సోషల్ మీడియా శివ మహేశ్వరరావు ఓబీసీ మోర్ చా పట్టణ శాఖ అధ్యక్షులు మాటూరి రమేష్ నాయుడు గొడ్డటి రాఘవ కిసాన్ మోర్చా నాయకులు పాలూరి మాలకొండ రెడ్డి ఆలూరు రాజేశ్వరరావు పాకల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

## పొగాకు పంటలను రైతు క్షేత్ర మిత్ర బృందం పరిశీలన




**కందుకూరు, ఫిబ్రవరి 24 ( నిజం చెపుతాం ) :** 26 వ వేలం కేంద్రం 27 వ వేలం కేంద్రం ఆధ్వర్యం లో పొగాకు కంపెనీ ప్రతినిధులతో ఏర్పడిన రైతు క్షేత్ర మిత్ర బృందం కందుకూరు వేలం కేంద్రం నెం 26 వేలం కేంద్రం పరిధి లోని కోవూరు , పందలపాడు 27 వ వేలం కేంద్రం పరిధి లోని లోని సామీర్ పాలెం, మోపాడు గ్రామాల లోని పొగాకు తోటలను క్యూరింగ్ బారన్ లను పరిశీలించారు.పొగాకు రైతులను కలుసుకొని వారి సమస్యలు తెలుసుకొని తగు సూచనలు చేశారు.పొగాకు తోటలో ఇరువైపులా సేద్యాలు చేయాలని పేర్కొన్నారు. పొగాకు మల్లె ఎక్కువ ఉన్న తోటలలో పూత రాకమునుపే మల్లెను పీకి కాల్చివేయాలని తెలిపారు.పొగాకు లద్దే పురుగు ఎక్కువ ఉన్న పొలాలలో ఇమామెక్టిన్ బెంజోట్ ను 5 గ్రా మందును 1 లీటర్ నీటిలో పిచికారి చేయాలన్నారు.ఆకు ముడుత ఉన్న పొలాలలో థయామిథా క్సామ్ ను 3 గ్రాముల మందును 10 గ్రాముల నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. పక్వానికి వచ్చిన ఆకులను మాత్రమే హార్వెస్టింగ్ చేసుకోవాలని తెలియజేసారు . బారన్ లలో క్యూరో మీటర్ ను పెట్టుకావాలని దాని వలన బారన్ అగ్ని ప్రమాదాలను నివారించవచని తెలిపారు.పొగాకు గ్రేడింగ్ చేసే సమయం లో తార్పలిన్ పట్ట ను వాడటం వలన అన్యపదార్థాలను నివారించ వచ్చని తెలియ జేశారు.. గ్రేడింగ్ చేయు సమయం లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.పొగాకు పాడవకుండా పొగాకు మండేలను వారానికి ఒకసారి తిప్పుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో వేలం నిర్వహణాదికారులు చైన్ రామ్ మీనా , రాజగోపాల్ , సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ జే తులసి , ఐటీసీ మేనేజర్ జి వెంకటేష్ , జీ పి ఐ మేనేజర్ ఉన్నం శ్రీనివాస్ , అలినేన్స్ కంపెనీ మేనేజర్ ఎన్ వెంకటేశ్వర్లు పొగాకు బోర్డు సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

## చందమూరి పాదయాత్రకు ఘనంగా స్వాగతం పలికిన వృద్ధులు

**ధర్మవరం ఫిబ్రవరి 24 ( నిజం చెపుతాం ) :** ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి గెలుపు కోసం ధర్మవరం మండలం శివా నగర్ శివాలయం నుండి తాడిమర్రి మండలం చిల్లవారి పల్లి కాటం కోటేశ్వర స్వామి ఆలయం వరకూ పాదయాత్ర నిర్వహిస్తున్న ధర్మవరం సచివాలయాల కన్వీనర్ చందమూరి నారాయణ రెడ్డి కి గొట్లూరు అనాథ ఆశ్రమం వృద్ధులు పలువురు ఘన స్వాగతం పలికారు. శనివారం నాడు జరిగిన పాదయాత్ర కు చక్కని స్పందన లభించింది.ఈ ఎన్నికలలో జగనన్న నే గెలిపిస్తాము. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి



వెంకట రామిరెడ్డి గెలుపు ఖాయం అంటూ పలువురు వృద్ధులు పేర్కొన్నారు.

## హిందూ మనోభావాలను గౌరవించాలి

### అక్రమ వసూళ్లను అరికట్టాలి..బిజెపి జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ

**ఆదోని ఫిబ్రవరి 24 ( నిజం చెబుతాం) :** బిజెపి జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ మీడియాలో మాట్లాడుతూ మహాశివరాత్రి సమీపిస్తున్న సమయంలో భక్తులు పాదయాత్ర ద్వారా శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకు నేందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో కాలినడకన ఆత్మకూరు నుండి వయా వెంకటాపురం నుంచిమొదలవుతుంది ఒక్కొక్క భక్తుడి నుండి అటవీ శాఖ సిబ్బంది పది రూపాయల రుసుమును అక్రమంగా వసూలు చేస్తూ సామాన్య భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు, ఎలాంటి సౌకర్యాలు కలిగించ కుండా అటవీ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినటుగా వ్యవహరిస్తున్నారు, సామాన్య భక్తులు అటవీశాఖ అధికారులను ప్రశ్నిస్తే ప్రభుత్వం ఏవైనా ఉత్తర్వులు జారీ చేసిందా అని అడుగితే అటవీశాఖ అధికారులు సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు కేవలం పర్యావరణ పరిరక్షణ కోసమే వసూలు చేస్తున్నామని అటవీశాఖ అధికారులు చేతివాటం చూపిస్తున్నారు కాబట్టి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని హిందూ మనోభావాలను



గౌరవించి హిందువు వ్యతిరేక విధానాన్ని వీడి ,అటవీ శాఖ అధికారులు అక్రమ వసూలను అరికట్టి అధికారులపై తగు చర్యలు తీసుకోవాలి , భక్తుల మనోభావాలను గౌరవించిస హకరించాలని , లేనిపక్షంలో బిజెపి ఉద్యమిస్తుందని ఆయన పేర్కొన్నారు

## గూడూరు టిడిపి అసెంబ్లీ టికెట్ సునీల్‌కి ఇవ్వడం హర్షం : పంత్రంగం వసంత్

**వాకాడు ఫిబ్రవరి 24 ( నిజం చెబుతాం) :** తిరుపతి జిల్లా వాకాడు... గూడూరు టిడిపి అసెంబ్లీ టికెట్టు పాశం సునీల్ కుమార్ ఖరారు చేసిన టిడిపి అధిష్టానానికి హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తిరుపతి జిల్లా పార్లమెంటరీ ఎస్సీ సెల్ కార్యదర్శి పంత్రంగం వసంత్ తెలిపారు. గూడూరు నియోజవర్గం కోట వాకాడు చిట్టమూరు చిల్లకూరు, గూడూరు, గూడూరు రూరల్ లలో రానున్న ఎన్నికల్లో అత్యధిక ఓట్లు నమోదు జరుగుతుందని,పాశం సునీల్ అన్నకు 50వేల మెజార్టీ వస్తుందని వసంత్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. పాశం సునీల్ కుమార్ పేద బడుగు బలహీన వర్గాల లలో ప్రత్యేక స్థానం ఉందని, గూడూరు నియోజవర్గం ప్రజలు ఆయన గెలుపు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. గడిచిన ఐదు సంవత్సరాలలో ప్రతిపక్షంలో ఉన్న గూడూరు నియోజవర్గం లోని ప్రజలతో మమేకమై ఉన్నారన్నారు. ఆయన గెలుపు కోసం ప్రజలు నిరీక్షిస్తున్నారన్నారు. ఇప్పటికే గూడూరు



నియోజవర్గం సునీల్ కుమార్ గెలుపు ఖాయమైపోయిందని ప్రజలు అనుకుంటున్నారన్నారు.

## సార్వత్రిక ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు


**అనకాపల్లి ఫిబ్రవరి 24 ( నిజం చెపుతాం ) :** త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా వుండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయంలో ఎన్నికల ముందస్తు ఏర్పాట్లుపై నోడల్ అధికార్లు, ఈఆర్ఓ, ఎఈఆర్వోల తో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ చిన్న తప్పుకు అవకాశం లేకుండా పగడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతుల న్నింటినీ కల్పించాలని సూచిం చారు. వికలాంగులు, వృద్ధులకు ర్యాంపులు తప్పని సరిగా వుండాలన్నారు. ప్రతి నియోజక వర్గంలో మోడల్ (నమూనా) పోలింగ్ బూత్‌ను



ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈవీయంల ద్వారా ఓటు వేసే విధానం, తమ ఓటు ఎక్కడ వుందో తెలుసుకునే విధానాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. అంతకు ముందు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఎమ్.కె.మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జిల్లా కలెట్టరు, అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను గురించి, ఎన్నికల ముందస్తు ఏర్పాట్లను గూర్చి కలెక్టర్ తెలియజేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో చిన్నికృష్ణ, నోడల్ అధికారులు డ్వామా పిడి ఇ.సందీప్, ఆర్అండ్‌బి ఈఈ రమేష్, మత్స్యశాఖ డిడి ప్రసాదరావు, ఎపిఎమ్ఐపి పిడి కెవి.లక్ష్మి, డిఎస్ఓ కెవిఎల్ఎన్ మూర్తి, పౌర సరఫరాల డియం జయంతి, లీడ్ బ్యాంక్ మేనేజరు సత్యనారాయణ, డిసిఓ కిరణ్ కుమారి, అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్ఓలు సత్యవాణి, కె.మనోరమ, కె.గీతాంజలి, తహశీల్దార్లు పాల్గొన్నారు.

నిజం

25 - 02 - 2024 ఆదివారం





# కన్నప్ప కూడా అదే బాటలో వెళ్తుందా..?




రిస్క్ చేస్తేనే కానీ ఇక్కడ సర్వైవ్ అవ్వలేమని తెలుసుకున్న స్టార్స్ సినిమా సినిమాకు భారీ రిస్క్ చేసి మరీ అభిమానులను, ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఈ క్రమంలో స్టార్ లెగసీ ఉన్న ఫ్యామిలీ హీరోలైతే ఇంకాస్త ఎక్కువ ఫోకస్ చేస్తున్నారు. మంచు ఫ్యామిలీ హీరో మంచు విష్ణు కూడా కెరీర్ లో భారీ రిస్క్ చేస్తున్నాడు. కన్నప్ప సినిమా చేయాలనే ఆలోచనే మొదలు తన మార్కెట్ ని మించి బడ్జెట్.. భారీ స్టార్ కాస్ట్ ఇలా సినిమాకు ఫుల్ ఎఫర్ట్ పెట్టేస్తున్నాడు మంచు హీరో. ప్రభాస్ లాంటి హీరోని సినిమాలో గెస్ట్ అప్పియరెన్స్ గా ఒప్పించి కన్నప్ప సినిమాను నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్తున్నాడు మంచు విష్ణు. కన్నప్ప సినిమాను ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్ట్ చేస్తున్నారు. మంచు విష్ణు 100 కోట్ల పైన బడ్జెట్ తో తెరకెక్కిస్తున్న ఈ సినిమా మొన్నటిదాకా ఒక సినిమాగా తీసుకురావాలనే ఆలోచన ఉన్నా ఇప్పుడు సినిమాను రెండు భాగాలుగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. బాహుబలి నుంచి ఒక కథను రెండు భాగాలుగా రెండు సినిమాలతో చెప్పొచ్చు అనే ధైర్యం ఇచ్చాడు దర్శక ధీరుడు రాజమౌళి. అదే పంథాలో కన్నడలో కె.జి.ఎఫ్ వచ్చింది. పుష్ప కూడా రెండు భాగాలుగా ఫిక్స్ చేశారు. ఇప్పుడు అదే పంథాలో కన్నప్పని కూడా రెండు భాగాలుగా చెప్పబోతున్నారని టాక్. సినిమాపై బజ్ పెంచే ప్రయత్నంలో ఒక గ్లింప్స్ రెడీ చేశారట కన్నప్ప టీం. ఈ టీజర్ తోనే సినిమా గురించి ఆడియన్స్ అంతా మాట్లాడుకునేలా చేస్తారని తెలుస్తుంది. ఇక సినిమా కూడా జరిగినంత వరకు బాగా వస్తుండటం వల్ల సినిమాను ఇంకా పొడిగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది. అందుకే కన్నప్పని కూడా టూ పార్ట్స్ గా రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ అవుతున్న సినిమాలన్నీ కూడా ఇలా రెండు భాగాలుగా సర్ ప్రైజ్ చేస్తున్నాయి. వాటి తరహాలోనే కన్నప్ప కూడా అలానే రాబోతున్నాడని తెలుస్తుంది. అయితే ఈ విషయంపై కన్నప్ప హీరో నిర్మాత మంచు విష్ణు స్పందించాల్సి ఉంది. హనుమాన్ సినిమాతో ప్రశాంత్ వర్మ బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. ఈమధ్య ఆధ్యాత్మిక కథలకు వెండితెర మీద మంచి క్రేజ్ ఏర్పడింది. ప్రేక్షకులు కూడా అలాంటి కథలు చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కన్నప్ప కూడా ఒక శివ భక్తుని కథ తప్పకుండా ఈ సినిమా కూడా నేషనల్ వైడ్ గా ప్రేక్షకులను అలరిస్తే సినిమా రికార్డులు సృష్టిస్తుందని చెప్పొచ్చు.

# పూజా హెగ్డే అలాంటి రోల్స్ వద్దంటుందా..?



టాలీవుడ్ లో స్టార్ రేంజ్ తెచ్చుకున్న పూజా హెగ్దె సడెన్ గా తెలుగులో ఖాళీ అవ్వడం అందరిని ఆశ్చర్యపరుస్తుంది. గుంటూరు కారం సినిమా నుంచి బయటకు వెళ్లిన పూజా బేబీ మరో తెలుగు సినిమా ఆఫర్ అందుకోకపోవడం సర్ ప్రైజింగ్ గా అనిపిస్తుంది. నిన్న మొన్నటిదాకా పూజా వెంట పడ్డ దర్శక నిర్మాతలు ఇప్పుడు ఆమె కాదని కొత్త హీరోయిన్స్ కోసం వెతుకుతున్నారు. ఒక్కసారి స్టార్ రేంజ్ వచ్చాక ఆ క్రేజ్ కు తగిన సినిమాలు.. పాత్రలే ఆశిస్తారు కాబట్టి పూజా హెగ్దే కూడా అలాంటి వాటి కోసమే వెయిట్ చేస్తుంది. అయితే లేటెస్ట్ గా పూజాకి ఒక ఆఫర్ వచ్చినా కూడా చేయనని చెప్పినట్టు తెలుస్తుంది. ఒక లైలా కోసం, ముకుంద సినిమాల నుంచి చూస్తే పూజా హెగ్దే చేసిన సినిమాలన్నీ కూడా సోలో సినిమాలే మరో హీరోయిన్ తో స్క్రీన్ షేర్ చేసుకున్న సందర్భాలు చాలా తక్కువ. అందుకే చేస్తే సోలో హీరోయిన్ గానే చేయాలని అనుకుంటుందట. అందుకే లేటేస్ట్ గా సెకండ్ హీరోయిన్ ఛాన్స్ వచ్చినా చేయనని చెప్పేసిందట. అసలు అవకాశాలు లేని టైం లో ఏదో ఒక ఆఫర్ వచ్చింది కదా అని చేయకుండా సెకండ్ లీడ్ గా వద్దని నిర్మొహమాటంగా చెప్పేస్తుందట. కావాలంటే రెమ్యునరేషన్ విషయంలో కాస్త హెచ్చు తగ్గులు ఓకే కానీ సోలో హీరోయిన్ గా ఒకవేళ ఇద్దరు హీరోయిన్స్ ఉంటే మెయిన్ హీరోయిన్ గా తనని తీసుకోవాలని అంటుందట. ఆఫర్లే లేనప్పుడు పూజా ఇన్ని కండీషన్స్ పెట్టడం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. టాలీవుడ్ లో ఛాన్స్ లు లేకపోతే బాలీవుడ్ అయినా అమ్మడిని ఆదరిస్తుందా అంటే అక్కడ కూడా పూజా కి అవకాశాలు రావట్లేదని తెలుస్తుంది. తెలుగులో అయితే ఈమధ్య కొత్త హీరోయిన్స్ జోరు ఎక్కువగా ఉంది కాబట్టి ఆల్రెడీ పూజా హెగ్దేని చూసి చూసి ఉన్నారనే కారణం చేత ఆమెను కాకుండా వేరే హీరోయిన్ తో సినిమా చేయాలని ప్రయత్నిస్తున్నారు. మరి పూజా హెగ్దే నెక్స్ట్ తెలుగు సినిమా ఏదై ఉంటుంది. ఆ లక్కీ ఆఫర్ ఎవరు ఇస్తారన్నది తెలియాల్సి ఉంది..ఆమె ఫ్యాన్స్ మాత్రం పూజా థై షో మిస్ అవుతున్నందుకు బాధపడుతున్నారు. పూజా హెగ్దే నెక్స్ట్ తెలుగు మూవీ కోసం బుట్ట బొమ్మ ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురుచూస్తున్నారు.

# స్పోర్ట్స్



# అదరగొట్టిన ఆకాశ్ దీప్



రాంచీ : ఇంగ్లండ్‌తో జరుగుతున్న నాల్గో టెస్ట్‌లో బెంగాల్ పేసర్ ఆకాశ్ దీప్ టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. జస్ప్రీత్ బుమ్రా స్థానంలో చోటు దక్కించుకున్న ఆకాశ్ దీప్.. అంచనాలకు తగ్గట్టుగానే రాణించాడు. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ టాపార్డర్‌ను కకావికలం చేసి తన అరంగేట్రాన్ని ఘనంగా చాటుకున్నాడు. బుల్లెట్ లాంటి బంతులతో తొలి మూడు వికెట్లు తీసి ఔరా అనిపించాడు. ఓపెనర్ క్రాలే వికెట్‌ను పడగొట్టి కెరీర్ తొలి వికెట్‌ను సాధించాడు. ఈ క్రమంలో సెలెక్టర్ల నమ్మకాన్ని వమ్ముచేయకుండా డకెట్, పోప్ వికెట్లను పడగొట్టి టాపార్డర్‌ను కట్టడి చేశా డు. నాల్గోటెస్ట్‌లో టాస్ గెలిచి తొలి గా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌ను యువ బౌలర్ ఆకాశ్ దీప్ కట్టడి చేశాడు. సిరాజ్‌కి తోడు స్పిన్నర్లు కూడా చెలరేగడంతో ఇంగ్లండ్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 7 వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్(106) సెంచరీ సాధించి అజేయంగా నిలవడం తొలిరోజు ఆటలో విశేషాలు. రూట్‌కు ఇది కెరీర్‌లో ఇది 31వ టెస్ట సెంచరీ. టీమిండియా కొత్త పేసర్ ఆకాశ్ దీప్ ధాటికి ఇంగ్లండ్ ఓ దశలో 112 పరుగులకే 5 వికెట్లు కోల్పో కష్టాల్లో పడింది. ఆ దశలో జట్టును రూట్-ఫోక్స్ ఆదుకున్నాడు. వికెట్ కీపర్ బెన్ ఫోక్స్‌తో కలిసి వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేశాడు. బెన్ ఫోక్స్ 126 బంతుల్లో 47 పరుగులు చేశాడు. వీఇరద్దరూ కలిసి 6వ వికెట్‌కు 113పరుగులు జతచేసి ఇంగ్లండ్‌ను ఆదుకున్నారు. ఈ జోడీని సిరాజ్ విడదీశాడు. బెన్ ఫోక్స్‌ను అవుట్ చేసిన సిరాజ్%ొా% ఆ తర్వాత టామ్ హార్ట్‌లీను పెవిలియన్ చేర్చాడు. దాంతో ఇంగ్లండ్ 245 పరుగుల వద్ద ఏడో వికెట్ కోల్పోయింది. ఈ క్రమం లోనే సెంచరీ పూర్తి చేసుకున్న రూట్%ొా% ఓల్లీ రాబిన్సన్‌తో కలిసి మరో వికెట్ పడకుండా విలువైన భాగస్వామ్యం నెలకొల్పాడు. తొలిరోజు ఆట ముగిసే సమయానికి రూట్ 106 పరుగులు, రాబిన్సన్ 31 పరుగులు క్రీజులో ఉన్నారు. రూట్ మొత్తం 223 బంతులు ఎదుర్కొని 9 ఫోర్లు కొట్టాడు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు జాక్ క్రాలే 42, బెన్ డకెట్ 11 పరుగులు చేశారు. ఓల్లీ పోప్ (0) డకౌట్ కాగా, జానీ బెయిర్ స్టో 38 పరుగులతో ఓ మోస్తరుగా రాణించాడు. కెప్టెన్ బెన్ స్టోక్స్ (3) నిరాశపరిచాడు. టీమిండియా బౌలర్లలో ఆకాశ్ దీప్‌కు మూడు, సిరాజ్‌కు రెండు, జడేజా, అశ్విన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

# ఇంగ్లండ్ ఆలౌట్..




రాంచీలో జరుగుతున్న నాలుగవ టెస్ట తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ జట్టు 353 పరుగులకు ఆలౌ టైంది. భారత స్పిన్నర్ రవీంద్ర జడేజా తన ఖాతా లో నాలుగు వికెట్లు వేసు కున్నాడు. రెండో రోజు జడే జా చివరి మూడు వికెట్లను తీసుకున్నాడు. కేవలం ఆరు పరుగుల తేడాలోనే ఇంగ్లండ్ తన చివరి మూడు వికెట్లను కోల్పో యింది. తొలి రోజు ఇంగ్లం డ్ ఏడు వికెట్ల నష్టానికి 302 రన్స్ చేసిన విషయం తెలిసిందే. ఇంగ్లండ్ బ్యాటర్ జో రూట్ 122 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. శుక్రవారం ఓ దశలో ఇంగ్లండ్ 112 పరుగులకే అయిదు వికెట్లు కోల్పోయింది. అయితే ఈ సిరీస్ ఆరంభంలో పెద్దగా ఆడలేకపోయిన జో రూట్ ఈ మ్యాచ్‌లో తన సత్తా చాటాడు. 274 బంతుల్లో అతను 122 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఆల్‌రౌండర్ ఓలీ రాబిన్‌సన్‌తో కలిసి 8 వికెట్‌కు కీలకమైన 103 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఇవాళ ఉదయం ఇంగ్లండ్ తొలి సెషన్‌లో 51 పరుగులు చేసింది. ఇండియన్ బౌలర్లలో స్పినర్ జడేజా నాలుగు వికెట్లు తీసుకున్నాడు. రాజ్‌కోట్ సెకండ్ ఇన్నింగ్స్‌లో అయిదు వికెట్లు తన ఖాతాలో వేసుకున్న జడ్డూ.. రాంచీలోనూ తన సామర్థ్యాన్ని నిరూపించాడు. స్పీడ్ బౌలర్ ఆకాశ్ దీప్ మూడు వికెట్లు తీసుకోగా, సిరాజ్ రెండు, అశ్విన్ ఒక వికెట్ తీసుకున్నారు.

